



రచన: దాసరి సుబ్రహ్మణ్యం

| | | | |
|---|---|---|---|
| భూషణరావు | : | వయసు షుమారు | 50 |
| దుర్గాంబ | : | భార్య ,, | 45 |
| ప్రభ | : | కూతురు ,, | 17 |
| సోము | : | నౌకరు ,, | 40–50 |
| రామారావు | : | ప్రభను ప్రేమించినవ్యక్తి | 25 |

కాలం : వర్తమానం

సమయం : సాయంత్రం 4 గంటలు

దృశ్యం :

గది. ఎదురుగా బార్లతెరచిన వాకిలీ, పక్కనే తెరచివున్న కిటికీ, కుడి పక్కగా మూసివున్న తలుపు. భూషణరావు టేబిలుముందు కుర్చీలో కూర్చొని పత్రిక చూస్తూంటాడు. టేబిలుమీద కొన్ని పుస్తకాలు సర్దిమాత్రం వుండవు; చిందర వందరగానూ వుండవు.

తలుపు పక్కగా రెండు కుర్చీలు. కుర్చీలో కూర్చొని దుర్గాంబ అల్లిక పని చేసుకుంటూవుంటుంది పక్కన ఖాళీకుర్చీ. తెరలేస్తూండగానే సంభాషణ సాగుతూంటుంది.

భూషణరావు– ఆఁ! ఆఁ! నిజమా? (పత్రికని కళ్ళకు దగ్గరగా పెట్టుకుని చూస్తాడు)

దుర్గాంబ– (తలవంచుకునే) కాక, అబద్ధాలా? మీ నుంచి నేను నేర్చుకోలేక పోయినవల్లా, అవొక్కటే.

భూష– అసంభవాలే, సంభవిస్తూండే అన్యాయకాలం యిది. ఏదీ నా కళ్ళజోడు?

(టేబిలు మీది పుస్తకాల్ని అటూయిటూ నెట్టూ వెతుకుతాడు. ఓ రెండు పుస్తకాలు కిందపడిన శబ్దం.)

దుర్గా— (తలఎత్తి) మీరనేదేవిఁటి ? దేనికోసం ఆ వెతుకుడు ?

భూప— జోడు, కళ్ళజోడు !

దుర్గా— అంత ఆదుర్దా ఎందుకు ? యిందాక యిక్కడే ఎక్కడో చూశాను.

(అల్లికసూదీ, దారం కుర్చీలో పెట్టి లేస్తుంది)

భూప— ఒక్క ఆదుర్దాఏ ఐతే, యింత ఆదుర్దా పడవలసిన అవసరం లేక పోను. రా, యిటు చూడు, యిక్కడ చదువు ! కళ్ళులేక పోయినా చదవగలనేమో కాని, కళ్ళజోడు లేకపోతే చదవలేను.

దుర్గా— (పత్రిక తీసుకుని) ఏం చదవమంటారు ? గంటలో యౌవ్వనమా ?

(నవ్వుతుంది.)

భూప— అలాంటివి వున్నా నీకుపయోగించవు కనక, నాకు వుపయోగించినా నిరుపయోగమే ! నేను చదవమనేది యిది. (పత్రిక మీద వేలుపెట్టి చూపుతాడు)

దుర్గా— (కోపంగా) మీసాలకు రంగు వేసేఁదుకూడా మించిపోయిన వయసు. అయినా యిలాంటి మాటలు మాట్టాడ్డం మీ చాతనేపౌను.

భూప— చేతలకి శరీరం కలిసి రానప్పుడు, మాటలతోనే మనస్సు తృప్తిపడుతుంది. యింతకీ ఆ చదవమన్నది చదివావు కాదు. యిష్టంలేకపోతే కళ్ళజోడైనా వెతికిపెట్టు.

దుర్గా— (రుసరుసగా) యిన్నిమాటలని వూరుకున్న తరవాత, నాకేనా సిగ్గులేంది ! మీరే వెతుక్కోండి.

[పత్రికని టేబిలుమీద పడేస్తుంది]

భూప— (బతిమాలుతూన్నట్టు) యిప్పుడు ఆజోడు ఎక్కడవున్నదో చూసేందుకు యింకోజోడు కావలసి వస్తుంది. అద్దాల్లోనుంచి చూడకుండా, నన్ను నేనే నమ్మకోలేను. యింతకుముందు ఆ చదివిందే నిజమైతే అమ్మాయికంటే అదృష్టవంతురాలు యిక పుట్టబోదు,

దుర్గా— (కుతూహలంగా) ఆఁ! ఏమన్నారు!

[టేబిలు మీది పత్రికతీసి చదివి భర్తవంక ఆశ్చర్యంగా చూస్తుంది]

భూప— అయితే నాకళ్ళు నిజాన్నే చూసేఁవంటావా? జై! హరనాథ్! నా చెవులు కూడా విని అంగీకరించందే, హృదయం నమ్మలేదు. యీ వయసులో ఒక్క కళ్ళనే నమ్ముకోవడం కన్న నమ్మకంలేని పని మరోటిలేదు. పెద్దగా చదువు.

దుర్గా— (ఆపి ఆపి చదువుతుంది)...పజిల్ లో నలభై ఐదువేల రూపాయిలు గెలిచినందుకు అభినందిస్తూ రాసిన స్నేహితులందరికీ కృతజ్ఞుణ్ని. విడివిడిగా రాయలేనందుకు క్షమించ కోర్తాను. ఇట్లు—రామారావు.

భూమ— (అల్లరిగా) ఏ రామారావూ?
దుర్గా— (కోపంగా) మీగ్గనక తెగిపోయింది. ఆరోజున అన్ని దుర్భాషలాడి...
భూమ— ఛా! ఆరోజున అన్ని దుర్భాషలాడింది అతన్ని కాదు; అతని బీదతనాన్ని.
దుర్గా— అయితే నా కూతురు విలవ నలభై ఐదు వేలే అన్నమాట! అంతకన్నా నాకు అవమానం మరోటిలేదు. యీ మాటనే ఇరవైఏళ్ళ కింద అని వున్నట్టయితే. హుం !
భూమ— అప్పుడు మన అమ్మాయి వయసు ఎంత అంటావ్. అబ్బాయి కావాలను కుంటూంటే, తరవాత నాలుగేళ్ళకిగదా— వాడు అమ్మాయిగా ప్రత్యక్షమైంది?
దుర్గా— ఏమైనా యిది నాకేకాక నా కూతురుక్కూడా అవమానం.

[కోపంగా కుర్చీలో కూర్చుని, అల్లికమూదీ, దారం అవతల పారేస్తుంది.]

భూమ— (దగ్గరగావెళ్తూ) ఏదైనా. ఏవో దుర్భాషలే ఆడి, ఆ చేసుకునేందుకు వచ్చిన వాడి విలువ అంత వరకు పెంచాను; మన అమ్మాయి విలువ కాదు. అతడితో నువ్వు సద్భాషలే ఆడి, నీ యిష్టం వచ్చినంత విలువ పెంచ గలిగితే నా కభ్యంతరం లేదు.
దుర్గా— (శాంతంగా) యింతకీ ఆ పజిల్ లో అంత డబ్బు వచ్చినమాట నిజమే నంటారా?
భూమ— చంపేశావ్ ! ఆ అనుమానం యింత వరకూ నాక్కలగలేదు. మగాడి విజ్ఞానానికీ, ఆడదాని అనుమానం తిరుగులేని విరుగుడు. ఆ యిద్దర్లో అవి పెరగ వలసిన పాళ్ళల్లో పెరిగినవాడు యీలోకమే స్వర్గమై పూరుకుంటుంది. అయినా, కాబోయ్యే అత్తామామల్ని అంత అమానుషంగా మోసగించాలని చూస్తాడంటావా రామారావు ?
దుర్గా— ఆ సంగతి మీమగాళ్ళకే తెలియాలి. మీరు మాత్రం, మా అమ్మా—నాననీ అనవసరమైన, అవసరాల పేరుతో ఎన్ని మోసాలు చేశారు కారు.
భూమ— గతాన్ని కుళ్ళగించకు. నేనేదైనా వాళ్లని మోసం చేస్తే—అది నీ కోసమే.
దుర్గా— అదే నేనూ అంట ! నన్ను కన్నందుకు వాళ్లమీద మీకు భక్తివున్నా, ఆ తరవాత బతికి వున్నందుకు బాధగానే వుండి వుండాలి. (మూతిముడుచు కుంటుంది)
భూమ— వాళ్ళేనో స్వర్గంలో చల్లగావున్నారు. యీ అనుమానాల మధ్యకి వాళ్ల నెందుకు యీడుస్తావ్. యింతకీ, ఆ రామారావుకి అంత డబ్బొచ్చిందో లేదో తెలుసుకోవాలి. ఎట్లా ?
దుర్గా— ఏ స్త్రీ డబ్బుకోసం, డబ్బుచూసి ప్రేమించదు. అలాంటిది మా వంశలోనే లేదు. మీ వంశలో వుండుగాక ! నా కూతురు డబ్బువున్నా లేకపోయినా, అవతలివాడు యిష్టపడందే చేసుకోదు.

భూప— పైత్యాన పడుతున్నావ్! వంశాల సంగతికొస్తే, చరిత్ర కందినంతలో మావంశంలో ఆడవాళ్ళే లేరు.

దుర్గా— సూటీపోటీ మాటలంటే నాకు చెడ్డ అయిష్టం. తలమీది వెంట్రుకల బిరుసు తగ్గినా, తలలోని బిరుసు తగ్గాలని ఎక్కడుందిలెండి!

భూప— (సీరియస్‌గా అన్నట్టు) ఇది ప్రణయకలహం కాదుగదా? ఈ మధ్య రెండు మూడు ఏళ్ళనుంచి అంతగా అలవాటులేక పోవడంచాత, ఆ చిహ్నాలని గుర్తుకు తెచ్చుకోలేక పోతున్నాను.

(సన్నగా ఈలవేస్తాడు)

దుర్గా— రసిక శిఖామణులు! వయసు మీరినకొందికీ మర్కటశిఖామణు లౌతున్నారు.

భూప— (భార్యపక్కన ఖాళీకుర్చీలో కూర్చుంటూ) అంటే, ప్రణయం ప్రథమదినాల వైపుకు పరుగిడుతోం దన్నమాట! సరేకాని, మన ప్రభ సంగతి...

దుర్గా— ప్రభసంగతేముంది? ట్యూషన్‌కు వెళ్ళింది. ఓ గంటలో వస్తుంది.

భూప— అది నాకూ తెలుసు. నే చెప్పేది (ఆగి)...ఆ సంబంధం మీ ఇద్దరికీ నచ్చిందే కదా?

దుర్గా— (ఆశ్చర్యం నటిస్తూ) ఏ సంబంధం?

భూప— (విసుగ్గా) అట్టే చంపకు. రామారావు సంగతేం చేద్దాం?

దుర్గా— ఇప్పుడు చేసేందు కేముంది? ఆరోజున మీరు అతన్ని అన్నిమాట లన్నతరవాత...యింతకీ, అంతడబ్బు వచ్చేవుంటుందంటారా?

భూప— ఆ సంగతి నిమిషాలమీద తేల్చేస్తాను. కాని అమ్మాయ్ ఏమనుకుంటుందో అని!

దుర్గా— అమ్మాయి ఏమనుకుంటున్నదో, ఏమనుకుంటుందో నాకు తెలుసు! మనపీడ వదిలిన తరవాత హాయిగా అతణ్నే చేసుకుందామనుకుంటున్నది. మనమే అంగీకరిస్తే మన నీడ వదలకుండా వుండడమే మంచిదనుకుంటుంది.

భూప— రామారావంటే అంత ప్రేమ వుందంటావా?

దుర్గా— మరేమనుకున్నారు? ఆడవాళ్ళది, అందులోనూ మా వంశంలోని ఆడవాళ్లది ప్రేమ విషయంలో భల్లూకపు పట్టనుకోండి. భల్లూకమైనా పట్టు సడలిస్తుం దేమోకాని మేము,...హుఁ! (తల మరోవైపుకు తిప్పుతుంది)

భూప— నీ పట్టు నాకు తెలుసులే! యాభై ఏళ్ళకే నూరేళ్ళూనిండినంత పనిజరిగింది. పోతే యీసంగతి...అమ్మాయికి యిష్టమే నంటావ్?

దుర్గా— అమ్మాయి అతణ్ని ప్రేమించేసింది. ఆ నలభై అయిదువేలు వచ్చినా రాకపోయినా దానికొకటే. యిక మనకి అది నిజమని తెలిస్తే ఎంత ఆనందంగా వుంటుంది! ప్రభతో చెప్పేముందు ఆ నిజానిజాలు తెలుసుకోవడం అవసరంగదా?

భూప— ఓ అది యిప్పుడే తేలుస్తాను. (లేచి కిటికీ దగ్గరకు వెళ్తాడు. బయటకు చూస్తూ) సోమూ! సోమూ!

సోము— (హడావిడిగా వచ్చి) పిల్చారాండి! పిల్చారా?

భూప— పిల్చాను. ఆ రామారావు అనే అబ్బాయి కనబడుతున్నాడా?

సోము— ఎవరండీ! (నసుగుతూ) ఆఁ! ఆ...అమ్మాయిగోర్ని—ఆఁ!

భూప— ఆఁ! అతనే, అతనే!

సోము— కనబడ్డాడండి. నేను పలకరించలేదు. మంచోడు కాదండి.

భూప— ఎందుకు పలకరించలేదురా? మంచివాడెందుకని కాదు?

సోము— (కోపంగా) మంచోడెలా అవుతాడండి? మన ప్రభుగోర్ని చేసుకుంటానని వత్తాడా! ఛీ!

భూప— ఛా! గాడిదా, అలా అనకు. నువ్వు పలకరించలేదనుకో, అతడే ఏమన్నా పలకరించాడా? మనిషెలా వున్నాడు?

సోము— (భయంగా) నేనేం పలకంచలేదండీ. అయినా నోటితో పలకరిత్తే పలక్క నే పోదును. మొన్న మారికెటులో కూరగాయలు కొంటూంటే, వెనక నుంచి ఒక ప్రపుల్లతో యీపున రెండుసార్లు పొడిశాడండీ. అబ్బా! అన్నాను. పలకరించానను కున్నాడో ఏమో 'బాగుందిరా?' అన్నాడండి. ఏం బాగా లేదన్నాను.

దుర్గా— ఓరి నీ తెలివితగలడా! బాగాలేంది ఏమిట్రా.

సోము— ఆయన చేసినపనండీ ఆ మాటకి ఆయన మరేదో అనుకున్నాడండీ, 'కుశాలాగా లేదా? టీపన్ ఎళ్లటం లేదా?' అని గుద్దు పైకేశాడండి. నాతప్పు లేదండి. నేను పలకరించలేదండి. పలకరించనండి.

భూప— ఏడిచావ్, తెలివితక్కువ వెధవా! అమ్మాయిని అతనికే యివ్వబోతున్నాం. గుడ్డలూ అవీ ఎలాంటివి వేసుకున్నాడు?

సోము— (కళ్ళు మిటకరిస్తూ) నిజమాండి! అమ్మాయి గోర్ని యిచ్చేత్తన్నారండి! నాకు తెలుచండి. భలేమంచోడండి. నా చేతులో పావలా పెట్టి, అమ్మాయిగోరికిమ్మని చిన్న కాగితం యిచ్చాడండి. అయ్యగోరికే ముందు ఇద్దామని వత్తున్నానండి; ఇంతలోకి అమ్మాయిగోరు యెదురుపడి మీకిత్తానని తీసుకున్నారండి.

భూప— ఆరి వెధవా! (బయట బూట్లచప్పుడు వినబడుతుంది. తెరచివున్న తలుపు వైపు చూస్తాడు)

రామారావు— (ఎడంచేతిని ప్యాంట్ జేబులోనే వుంచి కుడిచేతిని పైకెత్తి—వస్తూనే) నమస్కారమండి.

దుర్గా— ఆఁ! ఆఁ!

భూష— నువ్వా! కూర్చో. (దూరంగావున్న మరోకుర్చీ చూపెడతాడు.)

రామా— అంతా కులాసా అనుకుంటాను.

భూష— ఆఁ! అంతా కులాసాయే. నీ సంగతి ఇప్పుడే పత్రికలో చూశాను.

రామా— ఏదో మీ దయవల్ల... మీరు నమ్మలేదనుకుంటాను.

భూష— నమ్మినా; నమ్మనట్టే వూరుకోవడం మంచిదనుకున్నాను. ప్రభకి అన్నివిధాల తగినవాడివి నువ్వేనని అనుకుంటూండగానే మీ అత్తగారు తఫీమని ఆవార్తని నా కళ్లముందు వుంచేసింది. సముయానికి కళ్లకి జోడులేనందున అవి నమ్మక పోయినా, పెద్దగా చదివి వినిపించడంతో చెవులు కాస్తా నమ్మివూరుకున్నై.

దుర్గా— ఇంతకీ అది మా ప్రభ అదృష్టమంటాను.

రామా— ఎవరి అదృష్టమైనా మీ దృష్టి నామీదకు మళ్లడం నా అదృష్ట మనుకుంటున్నాను.

భూష— ఆ వార్త వినకముందు నీమీదకి దృష్టి మళ్ళినమాట నిజమే. కాని అది విన్న తరవాత మళ్లీ వెనక్కి మళ్ళుతున్నదేమో అని నాకు భయంగావుంది.

రామా— అలా జరిగితే, యిక నేను బతకలేను. కావాలంటే ఆ నలభై అయిదువేలు కరెన్సీగా మార్చి కట్టకట్టి కాలవలో పారేస్తాను.

భూష— ఛా! ఛా! అంత దుస్సాహసం చెయ్యకు. నాబుద్ధి మళ్లీ మళ్లీ మళ్లకుండా వుండాలంటే నాకు ఒకే ఒక మార్గం కనబడుతోంది. ఆ నలభైఐదువేలనీ కట్టగట్టిగానీ, చుట్టచుట్టిగానీ విసిరి ఓ నమ్మకమైన బ్యాంకులో జాగర్తగా పారేయడం. మేం బతికివుండగా ఆ విషయం తేమని దాని తరఫున కూడా హామీ యిస్తున్నాను ఓవేళ తెస్తే వూరుకునేది లేదని నువ్వు మీ ఆవిడ తరఫున కూడా హామీ యివ్వాలి.

దుర్గా— అప్పుడే వరసలు కలిసినై. యిక పేర్లుకుర్చి పోవడమే తరవాయి.

భూష— (నవ్వుతూ) నన్ను మామ అని పిలిచినా మామగారని పిలిచినా ఒక్కటే. పెళ్ళి త్వరలో అదే జరిగిపోతుంది. ఆచారాలకోసం గింజుకు చచ్చే ఆచారిని కాదు నేను.

రామా— అలాగే మాఁవగారూ! మీరు చెప్పినట్టే చేస్తాను. ఆ నలభైఐదువేలనీ వుండగాచుట్టి ఏ మంచి బ్యాంకులోనో పారేస్తాను. ఆ సంగతి మీరేకాదు ఎవళ్లడిగినా సహించను, అంతా వట్టిదే అని చెప్పేస్తాను. అసలు నేనే;అంతా వట్టిది, మాయ, మోసం, ఫూఁ! అనుకుంటాను.

భూష— మంచివాడవోయ్! అంతపెద్ద మొత్తం పజిల్‌లో నువ్వు గెలవడం వల్ల, మమ్మాయిని చేసుకునే నీ అర్హత కొంత తగ్గిందని మాత్రం గుర్తించు. అలాంటి ఘటన సంభవించకుండా వుండివున్నట్టయితే, మీకు నిరాఘాటంగా ఐదు రోజులపెళ్ళి, రేపే మొదలు పెట్టి చేసేవాణ్ణి. కాని యీ అవాంతరం వల్ల,

పెళ్లిరోజు పదిరోజులవరకూ అనివార్యంగా దాటేయవలసొచ్చింది. లోగడ ఓమారు నీతో అన్న మాటలు...(బయట టకటకమనే చెప్పుల ధ్వని. మొహం చిట్లించుకొని లేస్తాడు.) మాటల్లో టైమే మరిచిపోయాను. బజార్లో అవసరమైన పనుంది. రేపు కనబడవోయ్. (ప్రక్క వాకిలిన వెళ్తాడు.)

దుర్గా— (నవ్వి : పెద్దగా) దడదడల ఘన్య దొడ్డివాకిలికి పడ్డారు. బజారు వాకిలి యిటుండోయ్!

(దొడ్లోనుంచి భూషణరావు గొంతు : ఏవాకిలైనా యింట్లోనుంచి బయటికి దారితీస్తేసరి. సోముని తలుపు వేసి పొమ్మను.)

ప్రభ— (గదిలోకివస్తూ, రామారావును చూసి) హ్హా! నాన్నగారు లేరా?

(చేతిలోని పుస్తకాలు టేబిల్ మీద పెడుతుంది.)

దుర్గా— దారితప్పి, దొడ్డివాకిటన యిప్పుడే వెళ్ళారు. కాఫీవున్నదేమో నేనువంటింట్లోకి వెళ్ళొస్తాను. రెండు నిమిషాల్లో తిరిగొస్తాను. ఆ పైన ఒక్క సెకండు కూడా ఆలస్యం చెయ్యను. (వెళ్తుంది.)

రామా— (ప్రభ దగ్గిరకు వస్తూ) ప్రభా! మనం జయించాం. యిక నిన్ను ప్రేయసీ, గీయసీ అని పిలవను. అనే, ఒసె అనేస్తాను.

ప్రభ— (పెదాలు తిప్పుతూ) అలాపిలిస్తే చచ్చినా నేను సహించను. పజిలు, నలభై ఐదు వేలూ—అంతా వొట్టిదని యిప్పుడే చెప్పేస్తాను.

రామా— అలా అని నువ్వు కాదుగదా, నేను చెప్పినా మీ నాన్న నమ్మడు. ఆమాట తెస్తేనే అసలు వూరుకోడు. ఆదంతా మాట్లాడేశాం. అప్పుడే నిమిషం అయిపోయింది. ఇంకావున్న ఆ ఒక్క నిమిషం ఎందుకు పనికొచ్చేట్టు ఇద్దరిదీ కొత్తమేళమాయె! (ఇంకా దగ్గరకు వెళ్తాడు)

ప్రభ— (వారిస్తూ) అమ్మ ఇచ్చిన టైము రెండునిమిషాలు కాదు ఒకనిమిషమే!

దుర్గా— (వాకిట్లో కనబడ్తూ, పెద్దగాదగ్గి) అయ్యో, నా మతిమరుపుకాలా! కాఫీ చేద్దామనుకుంటూనే మర్చిపోయాను. అరగంటలో తిరిగొస్తాను. ఆపైన ఒక్క నిమిషంకూడా ఆలస్యం చెయ్యను. (వెళ్తుంది)

రామా— అరగంట ఎందుకు సరిపోయేట్టు! మీ అమ్మ నిష్కారణంగా అంత టైము యివ్వలేదనుకుంటాను?

(ప్రభకి దగ్గరగా జరుగుతూంటాడు)

(తెర తొందరగా)

★